సత్యమేవ జయతే


సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 10+8 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 195

శనివారం 5-10-2024



'ప్రతిభకు పేదరికం అడ్డు కాకూడదు. పేదింట్లో పుట్టిన ప్రతి ప్రతిభావంతుడు ఉన్నత చదువులు చదవాలి.'



దుర్గమ్మకు పూజలు

జిల్లాలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి.

- 5లో



ధ్రువపత్రాల పరిశీలన

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన కొనసాగుతోంది.

- 2లో

SIMULTANEOUSLY PRINTED AT NIZAMABAD | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

న్యూస్‌రీల్

ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణానికి మేలు

రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



ఖలీల్‌వాడి: ఎలక్ట్రిక్ బస్సులతో పర్యావరణ మేలు జరుగుతుందని రాష్ట్ర బీసీ సంక్షేమ, రోడ్డు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. భవిష్యత్ తరాలకు కాలుష్య రహిత వాతావరణం అందించడానికి ఎలక్ట్రికల్ బస్సులు అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొన్నారు. నగరంలోని బస్టాండ్‌లో 13 ఎలక్ట్రికల్ బస్సులను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆర్టీసీని బీఆర్ఎస్ హయాంలో నిర్లక్ష్యం చేశారన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీ ఇప్పుడు గట్టెక్కుతుందని చెప్పారు. జిల్లాకు 64 ఎలక్ట్రిక్ బస్సులను కేటాయించగా మొదటి విడతలో 13 బస్సులు వచ్చాయన్నారు. వీటిని నిజామాబాద్ నుంచి జేబీఎస్ వరకు నడపనున్నారని తెలిపారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించిన నాటి నుంచి మహిళలు రూ.3500 కోట్ల విలువైన ఉచిత ప్రయాణం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎం జానీరెడ్డి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి, మేయర్ నీతూకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేను అడ్డుకున్న 'మంచిప్ప' నిర్వాసితులు



నిజామాబాద్ రూరల్: మంచిప్ప రిజర్వాయర్ నిర్వాసితుల గురించి ప్రభుత్వం ఆలోచించాలని మంచిప్ప, బైరాపూర్ గ్రామ స్తులు పేర్కొన్నారు. శుక్రవారం బైరాపూర్ 21 ప్యాకేజీ పంప్ హౌస్ సర్వే చేయడానికి వచ్చిన ఇరిగేషన్ అధికారులను ప్రజలు అడ్డుకున్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. పాత డిజైన్ ప్రకారమే ఇరిగేషన్ అధికారులు సర్వే నిర్వహించాలని కోరారు. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ డీఈ గంగాధర్‌తో పాటు అధికారులను అడ్డుకొని వాగ్వివాదానికి దిగారు. దీంతో అధికారులు వెనుదిరిగారు.

గిరిజనుల అభివృద్ధికి చర్యలు



నిజామాబాద్ అర్బన్: జిల్లాలోని గిరిజనుల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. శుక్ర వారం కలెక్టర్‌లో ఆయన అధికారులతో సమీక్ష నిర్వహించారు. గిరిజనులకు అందిస్తున్న పథకాల పనితీరును పరిశీలించారు. పెండింగ్‌లో ఉన్న స్కీంలను వెంటనే గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. స్థానికంగా గిరిజనులు ఏ విధమైన యూనిట్స్ కావాలని కోరుకుంటున్నారో జాబితా పంపించాలన్నారు. అంతకుముందు డిచ్‌పల్లి మండలంలోని సీఎంఎస్టీ ఎంటర్‌ప్రైజెస్ కింద మంజూరు అయిన డైరీ యూనిట్‌ను, చందమామ ఆస్పత్రిని పరిశీలించారు. అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, గిరిజన అభివృద్ధి అధికారి నాగోరావు పాల్గొన్నారు.



పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో నిర్వహించిన సభలో పాల్గొన్న కాంగ్రెస్ శ్రేణులు



సభకు అభివాదం చేస్తున్న మహేశ్ కుమార్ గౌడ్

కాంగ్రెస్‌లో ప్రతి కార్యకర్తకు గుర్తింపు



మహేశ్‌కుమార్‌గౌడ్‌కు నాగలి బహూకరిస్తున్న రైతులు

నాకొచ్చిన పదవి కార్యకర్తలదే..

- వారి జీవితాల్లో వెలుగులు నింపుతాం
- స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం
- పార్టీని మరింత బలమైన శక్తిగా తయారు చేద్దాం
- అభివృద్ధిలో ప్రభుత్వంతో సమన్వయం
- డి శ్రీనివాస్ బతికుంటే ఆశీర్వాదం తీసుకునేవాడిని
- పీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్
- అభినందన సభకు భారీగా హాజరైన అభిమానులు, కార్యకర్తలు
- తరలివచ్చిన మంత్రివర్గం

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలకు ప్రాధాన్యత ఉంటుంది అనడా నికి ప్రస్తుతం పీసీసీ అధ్యక్షుడిగా తనకు దక్కిన గుర్తింపే నిదర్శనమని పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా నియామకం అయిన తర్వాత ఆయన తొలిసారి జిల్లాకు రాగా నగరంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో సన్మాన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కార్యకర్తల పనితీరు, మద్దతుతోనే తనకు పదవి దక్కిందన్నారు. ఇది కార్యకర్తలకే దక్కినట్లన్నారు. తన 38 ఏళ్ల రాజకీయ జీవితంలో అనేక కష్టాలు, నష్టాలు చవిచూశానని, అన్నింటికీ పీసీసీ అధ్యక్ష పదవి రూపంలో కాంగ్రెస్ అధిష్టానం వడ్డీతో సహా ఫలితం ఇచ్చిందన్నారు. 1986లో తాను ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా పదవీ బాధ్యతలు చేపట్టినప్పుడు పీసీసీ అధ్యక్ష పదవి దక్కుతుందని కలలో కూడా ఊహించలేదన్నారు. పార్టీ కోసం పాటుపడిన ప్రతి కార్యకర్త జీవితంలో వెలుగులు నింపుతామన్నారు. మారుమూల నాగన్నచెరువు (రహత్‌నగర్)లో పుట్టిన తాను ఊహించని రీతిలో పీసీసీ అధ్యక్షుడిని అయ్యానన్నారు. కాంగ్రెస్ అధినాయకత్వంతోనే కష్టానికి గుర్తింపు దక్కిందన్నారు. తల్లిదండ్రుల పుణ్యం, సహకరించిన అందరికీ ధన్యవాదాలంటూ మహేశ్‌గౌడ్ భావోద్వేగానికి గురయ్యారు. కాగా రాహుల్‌గాంధీ ఆలోచనా విధానంతో ముందుకు వెళతామన్నారు. ఇందులో భాగంగానే సోషల్ ఇంజినీరింగ్, బీసీ గణన జరుగుతోందన్నారు. ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేసే పనిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందన్నారు. స్థానిక ఎన్నికల్లో కార్యకర్తలందరికీ న్యాయం చేస్తామన్నారు. పీసీసీ కార్యవర్గం, జిల్లా కాంగ్రెస్ కమిటీల్లోనూ 60 శాతం పదవులు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వారికే కేటాయించనున్నట్లు మహేశ్‌గౌడ్ తెలిపారు. పార్టీ లో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు కొదవ లేదన్నా రు. కార్యకర్తలకు ఎలా న్యాయం చేయాలో కాంగ్రెస్ అధిష్టానానికి తెలుసన్నారు.

■ నిజామాబాద్‌లో మహేశ్‌గౌడ్ అభినందన సభకు మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కొండా సురేఖ, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు హాజరయ్యారు. తండ్రి మరణంతో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విదేశాల్లో ఉండడంతో భట్టి విక్రమార్క, సీతక్క, జూపల్లి కృష్ణారావు రాలేకపోయారు. మంత్రులు ఒక హెలీకాప్టర్‌లో వచ్చారు. మరో హెలీకాప్టర్‌లో కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథన్, మహేశ్‌గౌడ్ కుటుంబ సభ్యులు వచ్చారు.



పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మహేశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

డీఎస్ నా రాజకీయ గురువు

దివంగత ధర్మపురి శ్రీనివాస్‌తో తనకు కొన్ని విభేదాలు ఉన్నప్పటికీ రాజకీయ గురువుగానే భావిస్తానని మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. కరాటే మాస్టర్‌గా ఉన్న తనను రాజకీయాల్లోకి తీసుకొచ్చి ప్రోత్సహించిన డీఎస్ ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడిగా చేశారన్నారు. డీఎస్ బతికి ఉంటే పీసీసీ అధ్యక్షుడి హోదాలో వెళ్లి ఆయన ఆశీర్వాదం తీసుకునేవాడినన్నారు.

ఎమ్మెల్యే కావాలనుకున్నా..

1994లో నిజామాబాద్ రూరల్ నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడినప్పటికీ కాంగ్రెస్‌ను వీడకుండా 35 ఏళ్లగా పనిచేశానని మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. చాలామంది రాష్ట్ర సీనియర్ నాయకులు అండగా నిలిచారన్నారు. డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సభలో మంత్రులతో పాటు ప్రభుత్వ సలహాదారులు పోచారం శ్రీనివాస రెడ్డి, షబ్బీర్‌అలీ, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, నాయకులు సునీల్‌రెడ్డి, వినయ్‌రెడ్డి, అన్వేష్ రెడ్డి, ఈరవత్రి అనిల్, బాడ్సి శేఖర్‌గౌడ్, కాలూరి భోజన్న, బాస వేణుగోపాల్ యాదవ్, సయ్యద్ ఖైసర్, గడ్కోల్ భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా అభివృద్ధికి పాటుపడతా..

గతంలో పారిశ్రామికంగా ముందంజలో ఉన్న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ప్రస్తుతం వ్యవసాయపరంగా ముందంజలో ఉన్నప్పటికీ చాలా అంశాల్లో వెనకే ఉందని మహేశ్‌గౌడ్ అన్నారు. గతంలో సుదర్శన్‌రెడ్డి దివంగత వైఎస్ఆర్ హయాంలో మెడికల్ కాలేజీ తెచ్చారన్నారు. నీటి పారుదల పథకాలు తీసుకొచ్చారన్నారు. తెలంగాణ వర్సిటీ ఏర్పాటు చేశారన్నారు. పాస్‌పోర్ట్ కార్యాలయం వచ్చిందన్నారు. జిల్లాలో గతంలో బాలాగౌడ్ మొదలు అర్గుల్ రాజారాం, ధర్మపురి శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి ప్రభావితం చేయగా, ప్రస్తుతం పోచారం శ్రీనివాసరెడ్డి, సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ లాంటి సీనియర్లు పార్టీతో పాటు జిల్లాను అభివృద్ధిపథంలో తీసుకెళ్లేందుకు పట్టుదలతో ఉన్నారన్నారు. అలాగే అనుభవజ్ఞులైన కాంగ్రెస్ కార్యకర్తలు పుష్కలంగా ఉన్నారన్నారు. ప్రభుత్వం తరుపున ఆరు గ్యారంటీలను సంతృప్త స్థాయిలో ఇస్తున్నామన్నారు. జిల్లాలో లక్కంపల్లిలో ఉన్న సెజ్‌లో యూనిట్లు పెట్టి ఉపాధి కల్పించేలా మంత్రులతో మాట్లాడి సాధిస్తానన్నారు. విద్య విషయానికి వస్తే మరో వైద్య కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల తీసుకురావాల్సి ఉందన్నారు. రాజకీయంగా చైతన్యం ఉన్న ఈ జిల్లాలో అభివృద్ధి మరింత చేయాల్సి ఉందన్నారు. క్రీడల పరంగా జిల్లా ముందంజలో ఉందన్నారు. జిల్లాకు చెందిన బాక్సింగ్ చాంపియన్ నిఖత్ జరీన్‌కు ప్రభుత్వం డీఎస్పీ ఉద్యోగం ఇచ్చిందన్నారు.



సభలో మాట్లాడుతున్న పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, చిత్రంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సుదర్శన్‌రెడ్డి, భూపతిరెడ్డి, తోట లక్ష్మీకాంతారావు

దసరా కానుకగా పేదలకు డబుల్ ఇళ్లు

- ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా చర్యలు తీసుకోవాలి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, చిత్రంలో మంత్రులు కొండా సురేఖ, కోమటిరెడ్డి

నిజామాబాద్ అర్బన్: జిల్లాలో పూర్తయిన డబుల్ బెడ్ రూం ఇళ్లను దసరా కానుకగా అర్హులైన పేదలకు అందించాలని రాష్ట్ర రెవెన్యూ, సమాచార, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ కార్యక్రమాలు, సంక్షేమ పథకాల తీరుపై ఆయన రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖతో కలిసి శుక్రవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించేందుకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యవేక్షణలో లబ్ధిదారులుగా ఎంపిక చేయాలన్నారు. లబ్ధిదారుల ఎంపికకు త్వరలోనే ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేయనుందన్నారు. జిల్లాలో ధరణి దరఖాస్తుల పరిష్కారం, రెండు పడక గదుల ఇళ్ల నిర్మాణాల ప్రగతి, ఎల్ఆర్ఎస్, విద్య, వైద్యారోగ్య శాఖల పనితీరు తదితర అంశాల అమలు తీరు గురించి కలెక్టర్ మంత్రుల దృష్టికి తెచ్చారు.

జనవరి నుంచి సన్నబియ్యం పంపిణీ

ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురి కాకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని మంత్రి పొంగులేటి అధికారులను ఆదేశించారు. జనవరి నుంచి రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తామన్నారు. ప్రభుత్వ సలహాదారులు వేంనరేందర్ రెడ్డి, షబ్బీర్ అలీ, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ, ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్ ఈరవత్రి అనిల్, ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్, డీసీఎంఎస్ చైర్మన్ తారాచంద్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన సేవలు అందించాలి

విద్య, వైద్య రంగాల పనితీరును మెరుగు పరుచుకుని ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని హితవు పలికారు. విద్య, వైద్య శాఖల్లో సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల కల్పనకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. ఆస్పత్రుల్లో వైద్యుల పోస్టులను రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా భర్తీ చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తోందని, ఆలోపు కాంట్రాక్టు పద్ధతిన నియమించుకుని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ధరణిలో సమస్యల పరిష్కరం, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఓపీ సేవలు పెరగడంపై మంత్రి అభినందించారు.

అట్రాసిటీ కేసులు సత్వరమే పరిష్కరించాలి

- అణగారిన ప్రజలను ఇబ్బందులకు గురిచేసే వీడీసీలపై కఠిన చర్యలు
- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య, చిత్రంలో కలెక్టర్ హనుమంతు, సీపీ కల్మేశ్వర్

నిజామాబాద్ అర్బన్: అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ ఆధ్వర్యంలో పోలీసు, రెవెన్యూ, ఎస్సీ, ఎస్టీ అభివృద్ధి, సంక్షేమ శాఖల అధికారులు, కుల సంఘాల నాయకులతో అట్రాసిటీ కేసుల పురోగతి, ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఆయా సమస్యలపై బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. చైర్మన్ వెంకటయ్య మాట్లాడుతూ.. పెండింగ్ కేసులను నెల రోజుల్లో పరిష్కరించాలని, అవసరమైతే స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మూడు, నాలుగు దశాబ్దాల కాలంగా గ్రామాభివృద్ధి కమిటీలు ఆధిపత్యం కొనసాగిస్తున్నాయని అన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం వీడీసీలు కృషి చేయాలని, ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదని చైర్మన్ సూచించారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని అన్నారు. అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్, సీపీలకు సూచించారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయాలి

పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలీసింగ్ పక్కాగా అమలు జరిగేలా చూడాలని, ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా అధికారులు పని చేయాలని హితవు పలికారు. ఎస్సీ, ఎస్టీలను వేధింపులకు గురి చేసే అధికారులపై కమిషన్ కఠిన చర్యలు తీసుకుంటోందన్నారు. ఎక్కడైనా ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైతే అక్కడికి కమిషన్ వెళ్లి వారి సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తోందని తెలిపారు. ప్రతీ నెల చివరి వారంలో సివిల్ రైట్స్ డే, ప్రతి మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ మానిటరింగ్ కమిటీ సమావేశాలు నిర్వహించాలని అన్నారు. కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ కల్మేశ్వర్ చక్కగా పని చేస్తున్నారని జిల్లా ప్రజలలో మంచి పేరు వినిపిస్తోందని ఈ సందర్భంగా చైర్మన్ వారిని అభినందించారు. అట్రాసిటీ కేసులకు సంబంధించి స్టేషన్ బెయిల్ ఇస్తుండడంతో చట్టం నీరుగారిపోయే ప్రమాదం నెలకొందని చైర్మన్ అభిప్రాయపడ్డారు. సమీక్షలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, రేణిగుంట ప్రవీణ్, నీలాదేవి, శంకర్, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, డీఎస్సీడీవో బి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వరద కాలువ ద్వారా నీటి విడుదల



బాల్కొండ: ఎస్సారెస్పీలోకి శుక్రవారం ఉదయం నుంచి వరద పోటెత్తడంతో ప్రాజెక్ట్ అధికారులు వరద కాలువ ద్వారా నీటి విడుదల చేపట్టారు. ప్రాజెక్టులోకి 20 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. వరద కాలువ ద్వారా 10 వేలు, కాకతీయ కాలువ ద్వారా 6800, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వారా 500, గుత్పలిఫ్ట్ ద్వారా 135, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, మిషన్ భగీరథ ద్వారా 231, ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) ప్రస్తుతం అంతేస్థాయి నీటిమట్టంతో ప్రాజెక్టు నిండుకుండలా ఉంది.

ఓపెన్ స్కూల్ ప్రవేశాల గడువు పొడిగింపు

నిజామాబాద్అర్బన్: జిల్లాలోని ఓపెన్ స్కూల్ ప్రవేశాల్లో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగించినట్లు డీఈవో దుర్గాప్రసాద్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 30 వరకు అపరాధ రుసుముతో ప్రవేశాలు పొందవచ్చన్నారు. పదోతరగతిలో ప్రవేశం పొందేవారు రూ. 1660, ఇంటర్‌లో ప్రవేశం పొందేవారు రూ. 2000 చెల్లించి అడ్మిషన్ పొందాల్సి ఉంటుందన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, ఎక్స్ సర్వీస్‌మెన్‌లకు, మహిళలకు ప్రవేశంలో రాయితీ ఉంటుందని పేర్కొన్నారు. ఏపీ, టీఎస్ ఆన్‌లైన్, మీసేవ కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న ఓపెన్ పరీక్షలు

నిజామాబాద్అర్బన్: జిల్లాలోని పలు పరీక్షా కేంద్రాల్లో ఓపెన్ ఇంటర్, పదో తరగతి పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం మధ్యాహ్నం నిర్వహించిన పదో తరగతి పరీక్షలకు 108 మందికి 81 మంది హాజరు కాగా 27 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ పరీక్షల్లో 68 మందికి 53 మంది హాజరు కాగా 15 మంది గైర్హాజరయ్యారు.

తెయూ సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): హైదరాబాద్ సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి నేతృత్వంలో శుక్రవారం జరగాల్సిన తెయూ సెర్చ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. సాంకేతిక కారణాలతో సమావేశాన్ని వచ్చేవారం నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

కష్టపడిన వారికి స్థానిక ఎన్నికల్లో అవకాశాలు

- టీపీసీసీ అధ్యక్షుడి సన్మాన సభలో మంత్రులు, ఎమ్మెల్యేలు
- మహేశ్‌కుమార్‌గౌడ్‌కు ఘన స్వాగతం పలికిన నాయకులు, కార్యకర్తలు



టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

ఖలీల్‌వాడి: పార్టీ కోసం కష్టపడిన వారికి కాంగ్రెస్‌లో గుర్తింపు లభిస్తుందని, స్థానిక ఎన్నికల్లో అవకాశాలు లభిస్తాయని పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత బొమ్మ మహేశ్‌కుమార్‌గౌడ్ మొదటిసారిగా జిల్లాకు రావడంతో పార్టీ నాయకులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి అధ్యక్షతన స్వాగత సభను శుక్రవారం నిర్వహించారు. సభకు పార్టీ రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్‌మున్షీ, ఏఐసీసీ కార్యదర్శి విశ్వనాథ్, మంత్రులు, సీనియర్ కాంగ్రెస్ లీడర్లు హాజరై మాట్లాడారు.

విమర్శించే వారికి బుద్ధి చెప్పాలి



పార్టీ కోసం కష్టపడే నాయకులు, కార్యకర్తలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశాలు లభిస్తాయి. డీఎస్, వైఎస్సార్ కాంబినేషన్‌లో రెండు సార్లు కాంగ్రెస్ అధికారం చేపట్టింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సారథ్యంలో పార్టీ మరింత పుంజుకోనుంది. ఇకపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే వారికి తగిన రీతిలో బుద్ధి చెప్పాలి.

– కొండా సురేఖ, అటవీశాఖ మంత్రి

కాంగ్రెస్‌తోనే మంత్రిని అయ్యా..



పార్టీ కోసం కష్టపడ్డ వారికి కాంగ్రెస్ తగిన గుర్తింపు ఇస్తోంది. నేను పార్టీ కోసం 35 ఏళ్లుగా కష్టపడ్డాను. అందరికీ న్యాయం జరుగుతోంది. కాంగ్రెస్ అధికారం చేపట్టాక మూడు రోజులు కూడా ఉండదని మాజీ సీఎం కేసీఆర్ ఎద్దేవా చేశారు. మరి కేసీఆర్ అసెంబ్లీకి ఎందుకు రావడం లేదో చెప్పాలి.

– కోమటిరెడ్డి, రోడ్లు, భవనాల మంత్రి

హామీలను నెరవేరుస్తోంది



ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ పార్టీ నెరవేరుస్తోంది. సీఎం రేవంత్‌రెడ్డి పది నెలల పాలనపై ప్రతిపక్షాలు అప్రతిష్టపాలు చేస్తున్నాయి. గత ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం మహేశ్‌కుమార్‌గౌడ్ ఎంతో కష్టపడ్డారు. ఇప్పుడు తగిన గుర్తింపు లభించింది. ప్రతి కార్యకర్త పార్టీ గెలుపునకు కృషి చేయాలి.

– పొన్నం ప్రభాకర్, బీసీ, రవాణాశాఖ మంత్రి

రంజీ ట్రోఫీ ఆడాను



జిల్లా కేంద్రంలో రంజీ ట్రోఫీ క్రికెట్ ఆడాను. దీంతోనే జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. నిజామాబాద్‌తో నాకు ఎంతో సంబంధం ఉంది. ఎన్ఎస్ యూఐ నుంచి యూత్ కాంగ్రెస్, వివిధ పదవులు చేపట్టిన బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్ కు పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు.

– అజారొద్దీన్, మాజీ ఎంపీ

నిజాంషుగర్స్‌ను తెరిపిస్తాం



నిజాంషుగర్స్ ఫ్యాక్టరీని తెరిపిస్తాం. గల్ఫ్ బాధితులకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటోంది. కష్టపడి పని చేసిన వారికి పార్టీలో గుర్తింపు ఉంటుంది. అందుకు నిదర్శనం మహేశ్‌కుమార్ గౌడ్. ఆయన పార్టీ కోసం ఎంతో కష్టపడ్డారు. జిల్లాకు పీసీసీ అధ్యక్షుడిగా నియమించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు.

– జీవన్ రెడ్డి, ఎమ్మెల్సీ

స్మార్ట్ కార్డుతోనే పథకాలు



గత ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇండ్లను మధ్యలో నిలిపివేసింది. దానిని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేస్తోంది. అర్హులను గుర్తించి దసరాలోగా ఇండ్లను అందిస్తాం. రాబోయే రోజుల్లో తెల్ల రేషన్ కార్డుతోపాటు అన్ని సంక్షేమ పథకాలకు స్మార్ట్ కార్డులే ఆధారం కానున్నాయి. జనవరి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా సన్నబియ్యం అందిస్తాం.

– పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రెవెన్యూశాఖ మంత్రి

ఈ ఖరీఫ్ నుంచే బోనస్



ఈ ఖరీఫ్ సీజన్‌లోనే రూ. 500 బోనస్ అందిస్తాం. అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులతో పంటలు నష్టపోయే వారికి పంటల బీమా అందిస్తాం. దీనికి ప్రీమియం ప్రభుత్వమే చెల్లిస్తుంది. గత ప్రభుత్వం పెద్దమొత్తంలో అప్పులు చేసింది. అప్పులు చెల్లిస్తూనే రైతులకు పంట రుణమాఫీ, రైతుభరోసాతో పాటు ఇతర పథకాలు అందిస్తున్నాం.

– తుమ్మల నాగేశ్వర్‌రావు, వ్యవసాయశాఖ మంత్రి

స్థానిక ఎన్నికల్లో గెలిపించాలి



రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్‌ను గెలిపించాలి. గత ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించలేదు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి. రాహుల్‌గాంధీ జిల్లాకు పీసీసీ అధ్యక్ష పదవీ ఇచ్చినందుకు ధన్యవాదాలు.

– సుదర్శన్‌రెడ్డి, బోధన్ ఎమ్మెల్యే

కుల గణన చేసిన తర్వాతే..



కులగణన చేసిన తర్వాతే స్థానిక ఎన్నికలు జరపాలి. 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు పెరుగుతాయి. పాత, కొత్త వారిని సమన్వయం చేస్తూనే పాత వారికి తగ్గిన గుర్తింపు ఇవ్వాలి. పీసీసీ కమిటీతో పాటు డీసీసీలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అవకాశం కల్పించాలి.

– హన్మంత్‌రావు, పీసీసీ మాజీ అధ్యక్షుడు

జిల్లాతోనే రాజకీయ జీవితం



నాకు జన్మనిచ్చింది హయత్‌నగర్ అయినా.. రాజకీయ జీవితాన్నిచ్చింది నిజామాబాద్ జిల్లానే. ఈ జిల్లాతో అనుబంధం నాకు జీవితాంతం ఉంటుంది. జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ భవనం ఏర్పాటు చేయాలి. ఇందుకు తనవంతుగా రూ. 5 లక్షల విరాళంగా అందిస్తున్నా.

– మధుయాష్కీ గౌడ్, మాజీ ఎంపీ, టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్

రాష్ట్రాన్ని గాడిలో పెడుతున్నారు



గత ప్రభుత్వ పాలనలో రాష్ట్రం గాడి తప్పింది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమైంది. దానిని గాడిలో పెట్టేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క కృషి చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారంటీలను కచ్చితంగా అమలు చేస్తాం. పార్టీ పథకాలను నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలి.

– శ్రీధర్‌బాబు, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి

పీసీసీ అధ్యక్షుడికి సన్మానాలు.. జ్ఞాపికలు



పీసీసీ అధ్యక్షుడితో ఎన్ఎస్‌యూఐ నాయకులు



జ్ఞాపికను అందజేస్తున్న పోచారం శ్రీనివాస్‌రెడ్డి

జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ గ్రౌండ్‌లో శుక్రవారం నిర్వహించిన సభలో పీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్‌కుమార్ గౌడ్‌ను పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మంత్రులు, రైతులు, పార్టీ అనుబంధ నాయకులు సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సభకు హెలికాప్టర్‌లో వచ్చిన రవాణా శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి కలెక్టర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.



గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్



వేదికపై కుటుంబ సభ్యులతో మహేశ్‌కుమార్‌గౌడ్

ధ్రువపత్రాల పరిశీలనకు నేడు చివరి రోజు



నిజామాబాద్ అర్బన్ : డీఎస్సీ ఫలితాల్లో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనకు శనివారం చివరి రోజు అని డీఈవో దుర్గాప్రసాద్ తెలిపారు. మెసెజ్ వచ్చిన అభ్యర్థులు వెరిఫికేషన్‌కు హాజరు కావాలని సూచించారు. కాగా శుక్రవారం ధ్రువపత్రాల పరిశీలనకు 430 మంది హాజరయ్యారు. మూడు రోజుల్లో 1,150 మంది అభ్యర్థులు హాజరైనట్లు ఆయన తెలిపారు.

ఒకరి అదృశ్యం

పిట్లం: మండలంలోని పారేడ్‌పల్లి గ్రామానికి చెందిన కత్తిగామ సాయిలు అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన సాయిలు సెప్టెంబర్ 29న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. సాయిలు భార్య చంద్రవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

రాజీవ్‌నగర్‌లో..

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్ కాలనీలో నివాసం ఉండే ఏలేటి అచ్యుత్ కుమార్ అనే వ్యక్తి అదృశ్యమైనట్లు పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి శుక్రవారం తెలిపారు. కూలీ పని చేసుకుంటూ జీవించే అతను ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అతని భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

నకిలీ పాస్‌పోర్ట్ కేసులో ఇద్దరి అరెస్ట్

కామారెడ్డి క్రైం: నకిలీ పాస్‌పోర్ట్ కేసులో రామారెడ్డి మండలం రెడ్డిపేటకు చెందిన ఇద్దరిని ఢిల్లీ పోలీసులు అరెస్ట్ చేసిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలిలా ఉన్నాయి. రెడ్డిపేటకు చెందిన వాహబ్ మహమ్మద్ తన పేరును హసన్ అబ్దుల్‌గా మార్చుకుని తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించాడు. వాటితో పాస్‌పోర్ట్ పొంది కొన్ని రోజుల క్రితం కువైట్ వెళ్లాడు. అక్కడి ఇమిగ్రేషన్ అధికారులు నకిలీ పాస్‌పోర్టుగా గుర్తించి విమానంలో అతడిని తిరిగి ఢిల్లీకి పంపించారు. ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో దిగగానే వాహబ్ మహమ్మద్‌ను ఇక్కడి ఇమిగ్రేషన్ అధికారులు అరెస్ట్ చేసి పీఎస్‌కు తరలించారు. తప్పుడు ధ్రువపత్రాలతో పాస్‌పోర్ట్ తయారు చేయడంలో రెడ్డిపేటకు చెందిన మరో ఇద్దరు వ్యక్తులు మహమ్మద్‌కు సహకరించినట్లుగా ఢిల్లీ పోలీసుల విచారణలో తేలింది. వారిని కూడా అరెస్ట్ చేయడానికి రెండు రోజుల క్రితం ఢిల్లీ నుంచి పోలీసులు రెడ్డిపేటకు వచ్చారు. ఈ కేసులో రెడ్డిపేటకు చెందిన శంకర్ నాయక్‌ను అరెస్ట్ చేయగా మరో జిరాక్స్ సెంటర్ యజమాని పరారీలో ఉన్నట్లు తెలిసింది.

చికిత్స పొందుతూ ఎంపీడీవో..



ముజఫర్ ఉద్దీన్ (ఫైల్)

బాల్కొండ: ముప్కాల్ ఎంపీడీవో ముజఫర్ ఉద్దీన్ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నివాసముండే ఎంపీడీవో గత సోమవారం విధులకు హాజరయ్యేందుకు మండల కేంద్రానికి బస్సులో వచ్చాడు. ముప్కాల్‌లో బస్సు దిగి కార్యాలయం వైపు రోడ్డు దాటుతుండగా బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో అతని తలకు తీవ్రగాయాలు కావడంతో నిర్మల్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ ఉదయం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రజనీకాంత్ పేర్కొన్నారు.

క్రైం కార్నర్

తప్పిపోయిన బాలుడి అప్పగింత



రుద్రూర్: జార్ఖండ్ రాష్ట్రం నుంచి తప్పిపోయి వచ్చిన పదకొండేళ్ల బాలుడు వీరకుమార్‌ను శుక్రవారం బాలల సంరక్షణ సమితి అధికారులు కుటుంబ సభ్యులకు అప్పగించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల జార్ఖండ్‌లో వరదల కారణంగా బాలుడు తప్పిపోయి ట్రెయిన్‌లో బోధన్‌కు చేరుకున్నాడు. బోధన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా పోలీసులు బాలుడిని పీఎస్‌కు తీసుకెళ్లిన అనంతరం సంరక్షణ నిమిత్తం కోటగిరి మండలం ఎక్సాపూర్ క్యాంపు గుమ్మడి ఫౌండేషన్ అనాథ ఆశ్రమంలో చేర్పించారు. ఆశ్రమ నిర్వాహకులు బాలుడికి బట్టలు, భోజనం అవసరమగు వసతి కల్పించారు. తెలుగు భాష రానందున బాలుడితో హిందీలో మాట్లాడుతూ.. బాలుడి తల్లితండ్రుల వివరాలు తెలుసుకుని బాలల సంరక్షణ అధికారులకు తెలియజేశారు. బాలుడు ఇచ్చిన సమాచారం మేరకు జార్ఖండ్‌లోని తల్లిదండ్రులను పిలిపించి ఆశ్రమ నిర్వాహకుల సమక్షంలో కుటుంబ సభ్యులకు బాలుడిని అప్పగించారు. కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ చైర్‌పర్సన్ సంపూర్ణ, అధికారి చైతన్య కుమార్, ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

పిట్లం: ఆర్థిక ఇబ్బందులో ఒకరు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన పిట్లం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఘటనకు సంబంధించి పోలీసులు శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన విశాల్(37) కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. దీంతో తాగుడుకు బానిసై గ్రామ శివారులోని మారేడు చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య గంగామణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పోలీసుల అదుపులో వసూళ్లకు పాల్పడుతున్న ముఠా

- స్వచ్ఛంద సేవా సంస్థల పేరుతో వసూళ్లు



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ ప్రాంతంలో ప్రఖ్యాత స్వచ్ఛంద సంస్థ పేరుతో వసూళ్లకు పాల్పడుతున్న ముఠాను ఆర్మూర్ పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. గత పదిరోజులుగా ఆర్మూర్ కేంద్రంగా అడ్డా ఏర్పాటు చేసుకొని ఆర్మూర్, బాల్కొండ, బోధన్ నియోజక వర్గాల్లోని పలు గ్రామాల్లో ఈ ముఠా వసూళ్లకు పాల్పడినట్లు సమాచారం. పదిమంది ముఠాగా ఏర్పడి ఇద్దరు చొప్పున గ్రామాల్లో తిరుగుతూ.. ప్రతిరోజు కొంత డబ్బులను వసూలు చేశారు. బోధన్ నియోజకవర్గం నవీపేట మండలం నాళేశ్వరంలో తపస్వీ స్వచ్ఛంద సేవా సంస్థ పేరుతో తిరుగుతూ వసూళ్లకు పాల్పడ్డారు. కాగా నాళేశ్వరానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధితో పాటు గ్రామస్తులకు ఆర్మూర్‌కు చెందిన తపస్వీ స్వచ్ఛంద సంస్థతో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకున్న పరిచయం ఉండటంతో ఆరాతీశారు. ముఠాను పట్టుకోవాలని ప్రణాళిక రచించారు. ఫౌండేషన్‌కు పుట్టిన రోజు సందర్భంగా సహాయం చేస్తామని ముఠాకు చెందిన ఇద్దరిని పిలిపించి ఆర్మూర్‌లోని తపస్వీ సంస్థకు తీసుకెళ్లారు. కాగా వీరు సంస్థకు చెందిన వారు కాదని తేలింది. వీరు మెద్చల్ కేంద్రంగా విజన్ ఇండియా ఫౌండేషన్ పేరుతో ఐడీ కార్డులు ధరించి డబ్బులు వసూళ్లకు పాల్పడుతున్నారు. దీంతో 10 మంది ముఠాను సభ్యులను కౌన్సిలర్ లిక్కిశంకర్ సహాయంతో సంస్థ సభ్యులు పోలీసులకు అప్పగించారు. పోలీసులు ముఠా సభ్యులను విచారిస్తున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో శుక్రవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి చెందారు. ఒకరు కుంటలో పడి మృతి చెందగా మరో ఇద్దరు రోడ్డు ప్రమాదాల్లో, ఓ యువకుడు గుండెపోటుతో మృతి చెందాడు.



చింటు (ఫైల్)

ఎల్లారెడ్డి: ప్రమాదవశాత్తు కుంటలో పడిన యువకుడు మృతి చెందిన ఘటన ఎల్లారెడ్డి మండలంలోని కొక్కొండ గ్రామంలో చోటు చేసుకున్నట్లు ఎస్సై మహేశ్ శుక్రవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమ్మరి చింటు(19) అనే యువకుడు గురువారం ఇంటి నుంచి బహిర్భూమికి వెళ్లి వస్తానని చెప్పి తిరిగి రాలేదు. కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ లభించలేదు. చింటు తండ్రి యాదగిరి శుక్రవారం గ్రామ శివారులో వెతుకుతుండగా మేకలవారి కుంటలో మృతదేహం కనిపించింది. దీంతో ఒడ్డుకు తీసుకు రాగా అప్పటికే మృతి చెందాడు. ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలో జారి పడి మృతి చెందాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..

మాచారెడ్డి: రెండు బైకులు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందిన ఘటన మాచారెడ్డి మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాకుల గుట్ట తండాకు చెందిన బానోత్ హనుమ(58) పని నిమిత్తం బైక్‌పై గురువారం రాత్రి మాచారెడ్డికి వస్తుండగా మండల కేంద్రంలోని చౌరస్తా ప్రాంతంలో ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొన్నది. ఈ ఘటనలో హనుమాకు తీవ్రగాయాలు కాగా స్థానికులు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



హనుమ (ఫైల్)

కమ్మర్‌పల్లిలో మరొకరు..

కమ్మర్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో ఓ బీజేపీ నేత మృతి చెందిన ఘటన కమ్మర్‌పల్లి మండల కేంద్రంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన బీజేపీ నేత చింత గణేశ్(49) శుక్రవారం మధ్యాహ్నం తన బైక్‌పై తన అత్తమ్మను ఉప్లూర్‌లో దింపి తిరిగి వస్తుండగా దమ్మన్నపేట శివారులోని వ్యవసాయ పొలం నుంచి అకస్మాతుగా హార్వెస్టర్ రోడ్డుపైకి రావడంతో గణేశ్‌ను ఢీకొన్నది. ఈ ఘటనలో గణేశ్ తలకు బలమైన గాయం కావడంతో స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. గణేశ్ నాలుగున్నరేళ్ల పాటు బీఆర్ఎస్ కమ్మర్‌పల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా పని చేశారు. కొన్ని అనివార్య కారణాలతో బీఆర్ఎస్‌ను వీడి బీజేపీలో చేరారు. గణేశ్ మృతిపై పలువురు నాయకులు సంతాపం తెలిపారు.



చింత గణేశ్(ఫైల్)

గుండె పోటుతో యువకుడు..



శేఖర్(ఫైల్)

లింగంపేట: మండలంలోని నల్లమడుగు గ్రామానికి చెందిన మెట్టు శేఖర్(28) శుక్రవారం గుండె పోటుతో మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. శేఖర్‌కు శుక్రవారం తెల్లవారు జామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబీకులు లింగంపేటలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో కామారెడ్డికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. గ్రామంలో ఎంతో కలుపుగోలుగు ఉండేవాడని గ్రామస్తులు తెలిపారు. శేఖర్ మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

వరకట్నం వేధింపుల కేసులో.. భర్త, అత్తలకు ఏడేళ్ల జైలు

కామారెడ్డి క్రైం: వరకట్నం కోసం ఓ ఇల్లాలిని వేధింపులకు గురిచేసి ఆమె మృతికి కారణమైన భర్త, అత్తమ్మలకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. వివరాలిలా ఉన్నాయి. దోమకొండ మండలం సంగమేశ్వర్ గ్రామానికి చెందిన లావణ్య(24) భిక్కనూరు మండలం రామేశ్వర్‌పల్లి గ్రామానికి చెందిన మల్లాని గణేశ్ ప్రేమించుకున్నారు. వీరి ప్రేమను అంగీకరించిన లావణ్య అన్న రామస్వామి ఐదేళ్ల క్రితం పెద్దల సమక్షంలో వివాహం జరిపించాడు. కొద్ది రోజులు బాగానే ఉన్నా భర్త గణేశ్, అత్త ఎల్లవ్వ వరకట్నం తీసుకురావాలని వేధింపులకు గురి చేశారు. శారీరకంగా, మానసికంగా వేధింపులు పెరగడంతో లావణ్య ఇంట్లోనే ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి అన్న రామస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చారు. నాటి నుంచి కేసు విచారణలో ఉంది. సాక్షాధారాలను పరిశీలించిన జిల్లా న్యాయమూర్తి సీహెచ్ వీవీఆర్ వరప్రసాద్ నిందితులకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10 వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. పోలీసుల తరపున వాదనలు వినిపించిన పీపీ రాజగోపాల్ గౌడ్, కేసును సరైన పద్ధతిలో విచారణ చేపట్టిన అప్పటి డీఎస్పీ ప్రసన్నరాణి, సీఐ కోటేశ్వరరావు, ఎస్సై రాజు, ప్రస్తుత డీఎస్పీ నాగేశ్వరరావు, సీఐ సంపత్ కుమార్, ఎస్సై సాయికుమార్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, సిబ్బంది ప్రమోద్ కుమార్‌లను ఎస్పీ సింధు శర్మ అభినందించారు.